● 12 కిలోల చేప

సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం పానుగోడులో రైతు కృష్ణకు గురువారం తన పొలం పక్కన పంటకాల్వలో 12 కిలోల చేప లభించింది. భారీ చేప దొరకడంతో కృష్ణ మురిసిపోయాడు. – సూర్యాపేట అర్బన్

గుజరాత్‌లోనే కరెంట్ కోతలు

- ప్రధాని నరేంద్రమోదీ సొంత రాష్ట్రంలోనే అంధకారం
- సబ్‌స్టేషన్ ప్రారంభోత్సవంలో స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి

కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలం కొల్లూరులో ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకర్‌రావుతో కలిసి విద్యుత్తు సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి

బాన్సువాడ రూరల్, అక్టోబర్ 5: సమైక్య రాష్ట్రంలో తీవ్రమైన విద్యుత్తు కొరత ఉండేదని, కరెంట్ కోసం రైతులు, ప్రజలు తరచూ రోడ్లపై ధర్నాలు, రాస్తారోకోలు చేసేవారని, స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ దూరదృష్టితో కరెంట్ కోతలు లేని తెలంగాణను చూస్తున్నామని స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. రూ.96,500 కోట్లు ఖర్చు చేసి విద్యుత్తు రంగాన్ని బలోపేతం చేశారని, యావత్ దేశంలోనే 24 గంటల ఉచిత విద్యుత్తు ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని ఆయన స్పష్టం చేశారు. కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలం కొల్లూర్‌లో సుమారు రూ.100 కోట్లతో ఏర్పాటు చేసిన 223/132/33 కేవీ విద్యుత్తు ఉపకేంద్రాన్ని గురువారం ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావు, ఎన్‌పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావు, డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డితో కలిసి స్పీకర్ ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో స్పీకర్ మాట్లాడుతూ.. తలసరి విద్యు త్తు వినియోగంలో తెలంగాణ అగ్రస్థానంలో ఉన్నదని తెలిపారు. ప్రధాని మోదీ సొంత రాష్ట్రంలోనే తీవ్రమైన విద్యుత్తు కొరత ఉన్నదని, పవర్ హాలిడే ప్రకటించిన ఘనత గుజరాత్ రాష్ట్రానికే దక్కిందని స్పీకర్ ఎద్దేవా చేశారు.

ఇంతకు మించిన పదవులొద్దు: స్పీకర్

బాన్సువాడలో స్పీకర్ మున్నూరుకాపులతో ముచ్చటిస్తున్న సమయంలో 'సార్ మీరు ఈ సారి హోం మంత్రి అవుతారు' అని పలువురు అనగా ప్రస్తుతం అత్యున్నతమైన స్పీకర్ పదవిలో ఉన్నానని, ఇంతకు మించిన పదవులు తనకు వద్దని స్పష్టం చేశారు.

పాలకుర్తిలో 50 పడకల దవాఖాన

- నెరవేరిన స్థానిక ప్రజల కల
- ప్రభుత్వ ఉత్తర్వులు జారీ
- సీఎం కేసీఆర్‌కు, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుకు ఎర్రబెల్లి కృతజ్ఞతలు

హైదరాబాద్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ): పాలకుర్తి ప్రజల కల నెరవేరింది. పాలకుర్తి ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ కేంద్రాన్ని 50 పడకల దవాఖానగా రాష్ట్ర ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేసింది. ఈ మేరకు గురువారం తెలంగాణ వైద్య విధాన పరిషత్తు (టీవీవీపీ) జీవో జారీ చేసింది. రూ. 17 కోట్లా 50 లక్షలకు పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. త్వరలోనే పనులు ప్రారంభించాలని ఆదేశించింది. దీనిపై పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు హర్షం వ్యక్తం చేశారు. పాలకుర్తి ప్రజల కలను నెరవేర్చిన సీఎం కేసీఆర్‌కు, మంత్రులు కేటీఆర్‌కు, హరీశ్‌రావుకు రుణపడి ఉంటానని పేర్కొంటూ, ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గత సెప్టెంబర్ 4న పాలకుర్తి పర్యటనలో మంత్రి హరీశ్‌రావు ఇచ్చిన హామీని ఈరోజు నిజం చేశారని కొనియాడారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామని మంత్రి తెలిపారు.

మిర్యాలగూడ మండలం శ్రీనివాస్‌నగర్ బీసీ గురుకుల పాఠశాలలో క్రీడా విజేతలకు ట్రోఫీ అందిస్తున్న మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి. చిత్రంలో ఆగ్రోస్ చైర్మన్ తిప్పన

కాంగ్రెస్‌వి మోసపూరిత హామీలు

- బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం
- ముఖ్యమంత్రి కేసీఆర్ చొరవతో పేదలకు కార్పొరేట్ విద్య
- మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

మిర్యాలగూడ రూరల్, అక్టోబర్ 5: ఎన్నికలు సమీపిస్తుండటంతో కాంగ్రెస్ నాయకులు మోసపూరిత హామీలతో ప్రజలను మభ్యపెడుతున్నారని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ వచ్చిన తరువాతనే సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రంలో అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని తెలిపారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలంలోని శ్రీనివాస్‌నగర్ బీసీ బాలికల గురుకుల పాఠశాలలో గురువారం ఉమ్మడి జిల్లా స్థాయి గురుకుల విద్యార్థుల క్రీడా పోటీల ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మండలి చైర్మన్ మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో నిర్లక్ష్యానికి గురైన గురుకుల పాఠశాలలను సీఎం కేసీఆర్ కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దినట్టు చెప్పారు. తెలంగాణలో ఉన్నన్ని గురుకుల పాఠశాలలు మరే రాష్ట్రంలోనూ లేవని అన్నారు. దేశంలో విద్యకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని, సీఎం కేసీఆర్ పాలనలో పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య అందుబాటులో వచ్చిందని తెలిపారు. అంతకుముందు మాడ్గులపల్లి మండలంలోని సీత్యాతండాలో రూ.10 కోట్లతో నిర్మించనున్న లిఫ్ట్ పనులు, పలు కార్యక్రమాలకు స్థానిక ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావుతో కలిసి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. కార్యక్రమంలో ఆగ్రోస్ చైర్మన్ తిప్పన విజయసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దమ్మన్నపేట ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ఈశ్వర్

స్వరాష్ట్రంలోనే జలసిరులు

- మంత్రి కొప్పుల ఈశ్వర్
- దమ్మన్నపేట ఎత్తిపోతల పథకం ప్రారంభం

ధర్మపురి, అక్టోబర్ 5: స్వాతంత్రం వచ్చిన తర్వాత ఏనాడూ కాల్వల నీటికి నోచుకోని ప్రాంతాల్లోనూ తెలంగాణ సర్కారు హయాంలో జలసిరులు కురుస్తున్నాయని రాష్ట్ర ఎస్సీ అభివృద్ధి, మైనారిటీ, దివ్యాంగుల సంక్షేమ శాఖల మంత్రి కొప్పుల ఈశ్వర్ స్పష్టం చేశారు. నీటికే నడక నేర్పిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందని చెప్పారు. గురువారం ధర్మపురి మండలం దమ్మన్నపేటలో గోదావరి ఒడ్డున రూ.18.91కోట్లతో నిర్మించిన ఎత్తిపోతలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నదుల వరద నీటిని సద్వినియోగం చేసుకోవడంలో రాష్ట్ర సర్కారు కార్యాచరణ తెలంగాణ సాగు ముఖచిత్రాన్నే మార్చేసిందన్నారు. ధర్మపురి నియోజకవర్గంలో గోదావరి ఒడ్డున 13 ఎత్తిపోతల పథకాలు నిర్మించి వేలాది ఎకరాలకు రెండుపంటలకు సాగునీరు అందిస్తున్నామన్నారు. ధర్మపురి వరప్రదాయినిగా ఉన్న అక్కెపెల్లి చెరువును గోదావరి నీటితో నింపటానికి రూ.70కోట్లతో ఎత్తిపోతల పథకం నిర్మిస్తున్నామన్నారు. అలాగే కాంగ్రెస్, బీజేపీలు అధికార దాహంతో పుట్టెడు అబద్ధాలు చెబుతున్నారని మంత్రి మండిపడ్డారు.

2030 వరకు జీవవైవిధ్య పరిరక్షణకు కార్యాచరణ

జీవవైవిధ్య మండలి చైర్మన్ రజత్‌కుమార్

హైదరాబాద్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో వచ్చే 2030 వరకు జీవవైవిధ్య పరిరక్షణ, అవగాహన, పరిశోధనలపై దృష్టి కేంద్రీకరించినట్టు రాష్ట్ర జీవవైవిధ్య మండలి చైర్మన్, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డాక్టర్ రజత్‌కుమార్ వెల్లడించారు. గురువారం హైదరాబాద్ కోఠి మహిళా విశ్వవిద్యాలయంలో జరిగిన సమావేశంలో జీవవైవిధ్య వ్యూహం, కార్యాచరణ ప్రణాళికను ఆయన విడుదల చేశారు. దేశంలో జీవవైవిధ్య కార్యాచరణ ప్రణాళికను విడుదల చేసిన తొలి రాష్ట్రంగా తెలంగాణ గుర్తింపు పొందిందని రజత్‌కుమార్ తెలిపారు. సెంటర్ ఫర్ ఇన్నోవేషన్స్ ఇన్ పబ్లిక్ సిస్టమ్స్ (సీఐపీఎస్)తోపాటు అనేక మంది వాటాదారులతో సంప్రదింపులు జరిపి ఈ కార్యాచరణను రూపొందించినట్టు చెప్పారు. అటవీ, వ్యవసాయం, నీటిపారుదల, పశుసంవర్ధక, మత్స్యశాఖ వంటి శాఖల కృషిని లెక్కించేందుకు బయోఫిన్ వంటి సాధనాలను ఉపయోగించినట్టు వివరించారు. రాష్ట్రంలోని సుసంపన్నమైన జీవ వైవిధ్యాన్ని పరిరక్షించడానికి మండలి విశేష చర్యలు తీసుకుంటుందని చెప్పారు. సీఐపీఎస్ డైరెక్టర్ డాక్టర్ వల్లి మాణికం కార్యాచరణ ప్రణాళిక గురించి వివరించారు.

ఆస్ట్రేలియా వెళ్తున్నానని బ్రిటన్‌లో ప్రత్యక్షం!

- యువతి అదృశ్యం కేసు ఛేదించిన పోలీసులు
- కుటుంబసభ్యులను ఏమార్చేందుకు అబద్ధం
- ప్రేమ వివాహమే కారణం.. వీడిన మిస్సింగ్ కేసు సస్పెన్స్

బంజారాహిల్స్, అక్టోబర్ 5: ఆస్ట్రేలియా వెళ్తున్నానని తండ్రికి మెసేజ్ పెట్టి అదృశ్యమైన యువతి కేసును ఫిలింనగర్ పోలీసులు విజయవంతంగా ఛేదించారు. షేక్‌పేట సమీపంలోని సబ్జా కాలనీకి చెందిన మాహియా తరన్నుమ్(24) డీ-ఫార్మసీ పూర్తిచేసి సోమాజిగూడలోని యశోదా దవాఖానలో పదిరోజులుగా ట్రైనింగ్ కోసం వెళ్తున్నది. మంగళవారం ఉదయం ఇంట్లోంచి వెళ్లిన మాహియా.. మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో 'నేను ఆస్ట్రేలియా వెళ్తున్నా. నా కోసం వెతకొద్దు' అని తండ్రి గఫార్‌కు వాట్సాప్ చేసింది. దీంతో ఆందోళన చెందిన అతడు దవాఖానలో వాకబు చేశాడు. అయితే తరన్నుమ్ రాలేదని తేలింది. అన్ని ప్రాంతాల్లో గాలించినా లాభం లేకపోయింది. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసుగా నమోదు చేసుకొని గాలింపు చేపట్టారు. సీసీ ఫుటేజీలు, సెల్‌ఫోన్ కాల్ డాటా ఆధారంగా తరన్నుమ్ తన స్నేహితుడు, బీహార్‌కు చెందిన నదీమ్‌తో కలిసి వెళ్లినట్టు తేలింది. దాంతో బీహార్ పోలీసులను అప్రమత్తం చేసి, శంషాబాద్ ఎయిర్‌పోర్టులో సమాచారం ఇచ్చారు. నదీమ్ స్నేహితుల ఫోన్ నంబర్లు సంపాదించిన ఫిలింనగర్ పోలీసులు వారిని ప్రశ్నించడంతో అసలు విషయం బయటపడింది. నదీమ్, తరన్నుమ్ 8 నెలల కిందటే రహస్యంగా పెండ్లి చేసుకున్నారని తెలిసింది. శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ప్రయాణికుల వివరాలు వడపోసి తరన్నుమ్, నదీమ్ యూకే వెళ్లినట్టు గుర్తించారు. స్నేహితులు ఇచ్చిన సెల్‌ఫోన్ నంబర్లు, ఇతర వివరాలతో నదీమ్‌కు కాల్ చేయటంతో.. తాము జనవరిలోనే పెండ్లి చేసుకున్నామని, కుటుంబసభ్యులకు చెప్తే పెండ్లికి ఒప్పుకోలేదని తెలిపాడు. మాస్టర్స్ చేసేందుకు బ్రిటన్ వచ్చామని వారిద్దరు వీడియో రికార్డింగ్ పంపించారు. బ్రిటన్‌లో ఉన్నట్టు తెలియజేసే ఆధారాలు, లొకేషన్, మ్యారేజ్ సర్టిఫికెట్ పంపటంతో కథ సుఖాంతం అయ్యింది. పోలీసులు యువతి తండ్రిని పిలిచి జరిగిన విషయం చెప్పి, కౌన్సెలింగ్ ఇచ్చారు. రెండ్రోజుల్లోనే యువతి అదృశ్యం కేసును ఛేదించిన ఫిలింనగర్ పోలీసులను ఉన్నతాధికారులు అభినందించారు.



నిజామాబాద్ జిల్లా మానాలలో బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి వేముల

పోడు పట్టాలు అందించిన ఘనత కేసీఆర్‌దే

మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

కమ్మర్‌పల్లి, అక్టోబర్ 5 : రాష్ట్రంలో గిరిజనుల పోడు పట్టాల కల నెరవేర్చిన ఘనత కేసీఆర్‌దేనని రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. గురువారం నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గ పరిధిలోని మానాల గ్రామం, తండాల్లో రూ.3.32 కోట్లతో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రి వేముల పాల్గొన్నారు. ఈ సందర్భంగా 762 గిరిజన కుటుంబాలకు 1,750 ఎకరాలకు సంబంధించిన పోడుపట్టాలు పంపిణీ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ పోడుపట్టాల పంపిణీ కేసీఆర్‌తోనే సాధ్యమైందని అన్నారు. తీజ్, సేవాలాల్ భవనాల నిర్మాణానికి రాష్ట్రంలోనే మొదటిసారిగా బాల్కొండ నియోజకవర్గంలోనే ప్రొసీడింగ్‌లు ఇచ్చినట్టు తెలిపారు. మానాల గ్రామంలో సీఎం కేసీఆర్ సహకారంతో రూ.100 కోట్లకుపైగా అభివృద్ధి పనుల కోసం ఖర్చు చేసినట్టు చెప్పారు. మానాల గ్రామానికి బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి కండ్లముందే ఉన్నదన్నారు. కాంగ్రెస్, బీజేపీలు చెప్పే మాయమాటలు నమ్మవద్దని కోరారు. అనంతరం భీమ్‌గల్ పట్టణంలో రూ.2.80 కోట్లతో నిర్మించనున్న ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ భవనానికి శంకుస్థాపన చేశారు.

దసరా షాపింగ్ బొనాంజా లోగోను ఆవిష్కరిస్తున్న తెలంగాణ పబ్లికేషన్స్ వైస్ ప్రెసిడెంట్ దేవరాజు చిరంజీవి. చిత్రంలో ఏడీవీటీ జీఎం ఎన్ సురేందర్‌రావు, వా అడ్వర్‌టైజింగ్ అధినేత వెంకట్రావు, ది చెన్నై షాపింగ్ మాల్ అమీర్‌పేట్ బ్రాంచ్ హెడ్ వీ సుదీప్ తదితరులు

దసరాకు బహుమతుల బొనాంజా

- 9 నుంచి 18 మధ్య షాపింగ్ చేసే వారికి ప్రతిరోజు 5 బహుమతులు
- బంపర్ ప్రైజ్ నిస్సాన్ మాగ్నెట్ కారు
- నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే ఆధ్వర్యంలో లోగో ఆవిష్కరణ

అమీర్‌పేట్, అక్టోబర్ 5: దసరా పండుగ వేళ మీ ప్రియమైన వారిని బహుమతులతో సంభ్రమాశ్చర్యాల్లో ముంచెత్తాలనుకుంటున్నారా? కారును బంపర్ ప్రైజ్‌గా గెలుచుకోవాలనుకొంటున్నారా? ప్రతిరోజూ స్మార్ట్ టీవీ, మొబైల్ ఫోన్, కిచెన్‌వేర్, రూ.5 వేల విలువైన గిఫ్ట్ హ్యాంపర్లు పొందాలనుకొంటున్నారా? అయితే మీకిదో సదావకాశం. ప్రతిరోజు ఐదు ప్రత్యేక బహుమతులు, బంపర్ ప్రైజ్‌గా నిస్సాన్ మాగ్నెట్ కారు గెలుచుకొనే సువర్ణావకాశం వచ్చేసింది. నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే దినపత్రికల ఆధ్వర్యంలో దసరా షాపింగ్ బొనాంజా అందుబాటులోకి రానున్నది. ఇందుకు సంబంధించిన షాపింగ్ బొనాంజా లోగో ఆవిష్కరణ గురువారం సాయంత్రం అమీర్‌పేటలో అట్టహాసంగా జరిగింది. ది చెన్నై షాపింగ్ మాల్, ఫ్రీడమ్ హెల్తీ కుకింగ్ ఆయిల్స్ టైటిల్ స్పాన్సర్‌గా వ్యవహరిస్తున్న బొనాంజా లోగోను తెలంగాణ పబ్లికేషన్స్ వైస్ ప్రెసిడెంట్ దేవరాజు చిరంజీవి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అశేష పాఠకుల ఆదరణతో దూసుకుపోతున్న నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే దినపత్రికలు ప్రతి సంవత్సరం నిర్వహించే దసరా షాపింగ్ బొనాంజా ఈ నెల 9 నుంచి 18 వరకు కొనసాగుతుందని చెప్పారు. దసరా సందర్భంగా కొనుగోలుదారులు చేసే షాపింగ్‌లకు మాల్స్ రాయితీలు ప్రకటిస్తుంటాయని, ఈ రాయితీలతోపాటు నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే ఆధ్వర్యంలో జరిగే దసరా షాపింగ్ బొనాంజాలో మరొక రాయితీ ఉంటుందని తెలిపారు. 9 నుంచి 18 మధ్య ఎంపిక చేసిన ఔట్‌లెట్లలో జరిపే కొనుగోళ్లపై కూపన్లు అందజేస్తామని పేర్కొన్నారు. ఈ బొనాంజాలో ప్రతిరోజు ఐదు ప్రత్యేక బహుమతులు స్మార్ట్‌టీవీ, మొబైల్, కిచెన్‌వేర్, రూ.5 వేల విలువైన గిఫ్ట్ హ్యాంపర్లు ఉంటాయన్నారు. బొనాంజా ముగిసిన తర్వాత జరిగే ఈవెంట్‌లో బంపర్ ప్రైజ్‌కు ఎంపికైన వారికి నిస్సాన్ మాగ్నెట్ కారు అందజేస్తామని చెప్పారు. దసరా షాపింగ్ చేసే వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

బొనాంజా స్పాన్సర్స్ వీరే..

నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే దసరా షాపింగ్ బొనాంజాకు టైటిల్ స్పాన్సర్లుగా ది చెన్నై షాపింగ్ మాల్, ఫ్రీడమ్ హెల్తీ కుకింగ్ ఆయిల్స్, మెయిన్ స్పాన్సర్లుగా సీఎమ్మార్ ఫ్యామిలీ మాల్ (తెలంగాణ), కేఎల్ఎం ఫ్యాషన్ మాల్, గిఫ్ట్ స్పాన్సర్‌గా బిగ్‌సీ, పవర్డ్ బై కేఫ్ నీలోఫర్‌తోపాటు బ్యాంక్ ఆఫ్ బరోడా, పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ), నిస్సాన్, కున్ హ్యుండాయ్, ఆర్వీ టూర్స్ అండ్ ట్రావెల్స్, మహవీర్ స్కోడా, మహవీర్ బెంజ్, వెంకటరమణ మోటర్స్ తోడ్పాటు అందిస్తున్నాయి. బొనాంజాకు డిజిటల్ పార్ట్‌నర్‌గా హైబిజ్ టీవీ, టీవీ పార్ట్‌నర్‌గా టీ న్యూస్, క్రియేటివ్ పార్ట్‌నర్‌గా హోప్ అడ్వర్‌టైజింగ్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవహరిస్తున్నాయి. ఈ బొనాంజాకు సంబంధించి హైదరాబాద్‌లో ఎంపిక చేసిన ఔట్‌లెట్ల వివరాలతో కూడిన సమాచారం నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే పత్రికల్లో ప్రతిరోజూ ప్రచురిస్తామని దేవరాజు చిరంజీవి వివరించారు. కార్యక్రమంలో ది చెన్నై షాపింగ్ మాల్ యాజమాన్యం ప్రతినిధులు, అమీర్‌పేట బ్రాంచ్ హెడ్ కే సుదీప్, వా అడ్వర్‌టైజింగ్ అధినేత వెంకట్రావు, నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే జీఎం (యాడ్స్) ఎన్ సురేందర్‌రావు, ఏజీఎంలు రాములు, రాజిరెడ్డి, కొనుగోలుదారులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో ఐటీ సోదాలు

- టార్గెట్ ఎమ్మెల్యే గోపీనాథ్ సోదరులు
- ఏకకాలంలో 100 బృందాల తనిఖీ

హైదరాబాద్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లో గురువారం మరోసారి పలుచోట్ల ఐటీ సోదాలు కలకలం రేపాయి. గురువారం తెల్లవారుజామునే సుమారు 100 ఇన్‌కం ట్యాక్స్ బృందాలుగా పలు ప్రాంతాల్లో సోదాలు చేశాయి. ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సోదరుడి ఇంటితో పాటు, బంధువులతో పాటు పలు కంపెనీలు, వ్యక్తుల ఇండ్లలో తనిఖీలు కొనసాగాయి. నగరంలోని పూజాకృష్ణ చిట్ ఫండ్ కార్యాలయం, ఇంట్లో కలిపి 40 మంది అధికారుల సోదాలు చేశారు. అలాగే, పలు చిట్ ఫండ్ కంపెనీలకు సంబంధించిన యజమానుల ఇండ్లు, ఆఫీసులతో పాటు స్థిరాస్తి సంస్థల్లో సోదాలు జరిగాయి. సోదాల్లో భాగంగా దస్త్రాలు, బ్యాంకు ఖాతాలు, ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్లు స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది. శంషాబాద్ పట్టణం హుడాకాలనీలో ఉన్న ప్రముఖ పారిశ్రామికవేత్త రఘువీర్ ఇంటిలో సోదాలు చేశారు. అరెకపూడి కోటేశ్వరరావు, అవిర్నేని వరప్రసాద్ ఇండ్లల్లో సోదాలు జరిగాయి. చిట్‌ఫండ్, స్థిరాస్తి కంపెనీల్లో అవకతవకలు జరిగాయనే సమాచారం మేరకు సోదాలు జరిగినట్టు తెలిసింది. అయితే, బుధవారం సాయంత్రానికే దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి ఐటీ అధికారులు భారీగా హైదరాబాద్‌కు చేరుకొని నిర్ణీత వ్యక్తులు, నాయకులు, ఇండ్లలో సోదాలు నిర్వహించారు. ప్రధాని మోదీ వచ్చి వెళ్లడం.. ఆ వెంటనే ఐటీ రైడ్స్ జరగడం పలు అనుమానాలకు తావిస్తున్నది. ఎన్నికలు ఎక్కడుంటే.. అక్కడికి మోదీ, అమిత్‌షా వెళ్తారని, వారు వెళ్లిన వెంటనే ఐటీ సహా, కేంద్ర దర్యాప్తు సంస్థలు ప్రవేశిస్తాయని విపక్ష నేతలు ఎప్పుడూ విమర్శలు గుప్పిస్తుంటారు. వారి విమర్శలకు తగ్గట్టుగానే గురువారం ఐటీ రైడ్స్ జరిగాయి.

నవంబర్‌లో కానిస్టేబుల్ శిక్షణ

- 16,604 మంది అభ్యర్థులకు ట్రైనింగ్
- 7 నుంచి ధ్రువీకరణ.. మెడికల్, ఎస్టీ వెరిఫికేషన్
- సమర్థంగా నియామకాలు చేపట్టిన టీఎస్ఎల్‌పీఆర్బీ

హైదరాబాద్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ): కొత్తగా కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు నవంబర్ మొదటి లేదా రెండో వారంలో శిక్షణను ప్రారంభించనున్నట్టు తెలిసింది. తెలంగాణ స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు (టీఎస్ఎల్‌పీఆర్బీ) ఆధ్వర్యంలో 16,604 కానిస్టేబుల్ పోస్టులకు గాను 15,750 మందిని శిక్షణకు ఎంపిక చేసింది. వీరిలో 12,866 మంది పురుషులు, 2,884 మంది మహిళలు ఉన్నారు. పోలీస్, అగ్నిమాపక శాఖలో డ్రైవర్ పోస్టుల జాబితాను వాయిదా వేసింది. ఇప్పటికే ఎస్సై ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు టీఎస్‌పీఏలో శిక్షణ పొందుతున్నారు. కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన వారికి ఈ నెల 7 నుంచి 10 వరకు ధ్రువీకరణ ప్రక్రియ ఉంటుంది. ఆ తర్వాత వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. అనంతరం స్పెషల్ బ్రాంచ్ పోలీసులతో ఎస్సీ వెరిఫికేషన్‌ను పూర్తి చేయనున్నారు. ఈ ప్రక్రియ మొత్తం పూర్తయ్యేందుకు సుమారు నెల రోజులపైనే పడుతుందని టీఎస్ఎల్‌పీఆర్బీ వర్గాలు తెలిపాయి. నెల రోజుల్లోగా పూర్తి చేసి, నవంబర్ మొదటి లేదా రెండోవారంలో శిక్షణను ప్రారంభించనున్నారు.

పకడ్బందీగా నియామక ప్రక్రియ

టీఎస్ఎల్‌పీఆర్బీ నిర్వహించిన కానిస్టేబుల్ ఉద్యోగాల నియామక ప్రక్రియ బోర్డు చైర్మన్ వీవీ శ్రీనివాసరావు నేతృత్వంలో విజయవంతంగా ముగిసింది. నిరుడు ఏప్రిల్‌లో నోటిఫికేషన్ విడుదల చేసిన నాటి నుంచి బుధవారం ఫలితాలు విడుదలయ్యే వరకూ వివిధ దశల్లో చేపట్టిన నియామక ప్రక్రియను బోర్డు పకడ్బందీగా నిర్వహించింది. ప్రాథమిక రాత పరీక్ష, దేహదారుఢ్య పరీక్షలు, తుది రాతపరీక్ష, సర్టిఫికెట్ల వెరిఫికేషన్, ప్రొవిజనల్ సెలక్షన్, రిజర్వేషన్లు, క్యాటగిరీల వారీగా అర్హుల ఎంపిక, తుది ఫలితాల వరకూ బోర్డు పారదర్శకంగా వ్యవహరించింది. గర్భిణులు, మార్కులు, కొలతలు, రిజర్వేషన్ల విషయంలో పలువురు అభ్యర్థులు హైకోర్టుకు వెళ్లినా, వారి అనుమానాలను హైకోర్టు ద్వారానే నివృత్తి చేస్తూ, న్యాయస్థానం సూచనలు పాటిస్తూ వచ్చింది. ఉద్యోగాలు ఇస్తామని నమ్మించే వారిపట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తూ, అలాంటి వారిని పట్టిస్తే రూ.3 లక్షల రివార్డు సైతం ఇస్తామని బోర్డు చైర్మన్ వీవీ శ్రీనివాసరావు ప్రకటించారు.

కానిస్టేబుల్ పోస్టుల నియామక వివరాలు

వచ్చిన దరఖాస్తులు	6,61,196
ప్రిలిమినరీ పరీక్ష రాసిన అభ్యర్థులు	6,03,955
పార్ట్-2 పరీక్షకు అర్హులు	2,37,862
తుది రాతపరీక్షకు హాజరు	1,16,464
ప్రొవిజనల్ సెలెక్షన్ అభ్యర్థులు	97,175
ఫలితాల్లో ఎంపికైన అభ్యర్థులు	16,604

19 వరకు బాబు రిమాండ్ పొడిగింపు

- బెయిల్, కస్టడీపై నేడు విచారణ

హైదరాబాద్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ): స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో అరెస్టయి రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్న టీడీపీ అధినేత చంద్రబాబు రిమాండ్‌ను ఏసీబీ కోర్టు ఈ నెల 19 వరకు పొడిగించింది. ఈ కేసులో రెండోసారి విధించిన రిమాండ్ గురువారంతో ముగియడంతో జైలు అధికారులు ఆయనను వర్చువల్‌గా జడ్జి ముందు హాజరు పరిచారు. జ్యుడీషియల్ రిమాండ్‌ను పొడిగించాలంటూ సీఐడీ మెమో దాఖలు చేసింది. దీనిని పరిగణనలోకి తీసుకున్న కోర్టు చంద్రబాబు రిమాండ్‌ను మరో రెండు వారాలు పొడిగిస్తున్నట్టు ప్రకటించింది. ఇదే కేసులో చంద్రబాబు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్, సీఐడీ దాఖలు చేసిన కస్టడీ పిటిషన్‌పై విచారణ మరోసారి వాయిదా పడింది. ఇరుపక్షాల వాదనలు శుక్రవారం మధ్యాహ్నం వింటామని ఏసీబీ కోర్టు వెల్లడించింది. చంద్రబాబు తరపున సుప్రీంకోర్టు న్యాయవాది ప్రమోద్‌కుమార్ దూబే, సీఐడీ తరపున అదనపు ఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపించారు.

ఎంసీఎఫ్, ఐజేఎంతో ఉమెన్ సేఫ్టీవింగ్ ఎంవోయూ

- ఇదొక చారిత్రక ఒప్పందం: ఏడీజీ శిఖాగోయెల్

హైదరాబాద్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో మహిళలు, పిల్లల భద్రత, శ్రేయస్సును పెంపొందించడమే లక్ష్యంగా తెలంగాణ ఉమెన్ సేఫ్టీ వింగ్... మై చాయిసెస్ ఫౌండేషన్ (ఎంసీఎఫ్), ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ (ఐజేఎం) ఎన్జీవోలతో గురువారం చేతులు కలిపింది. ఇప్పటికే ఈ రెండు సంస్థలు దేశవ్యాప్తంగా మహిళలు, పిల్లల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు సమర్థంగా కృషి చేస్తున్నట్టు ఏడీజీ శిఖాగోయెల్ తెలిపారు. ఈ గొప్